నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | గురువారం 23 జనవరి 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

## గ్రామ సభల్లో రచ్చ రచ్చ..

- వాంకిడిలో ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అర్హత లేని వారిని లబ్ధిదారులుగా గుర్తించారంటూ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిని అక్కడే ఉన్న అదనపు కలెక్టర్ డెవిడ్ సముదాయించారు.
- మందమర్రి మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన సభలో వేదికపై ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి పక్కనే కాంగ్రెస్ నాయకులు కూర్చోవడం, మరికొందరు నిల్చున్నా అధికారులు అభ్యంతరం వ్యక్తం చేయలేదు. అధికారులకు బదులుగా కొందరు కాంగ్రెస్ నాయకులు మైకు పట్టుకొని లబ్ధిదారుల పేర్లు చదవడంపై బీఆర్ఎస్ నాయకులు, స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు.



కాసిపేట : దేవాపూర్ గ్రామసభలో అధికారులను ప్రశ్నిస్తున్న మహిళ




దండేపల్లి మండలం కన్నేపల్లిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు



తాండూర్ : పోలీసు పహారా మధ్య గ్రామసభలో పాల్గొన్న బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్



భీమారంలో ఆందోళన చేస్తున్న గ్రామస్తులను అదుపు చేస్తున్న పోలీసులు

డే-2

- మందమర్రి మండలంలో చిర్రకుంటలో అర్హుల పేర్లు రాలేదని అనర్హులనే ఎంపిక చేశారని అధికారులుపై గ్రామస్తులు ఆందోళన చేయగా పోలీసులు సముదాయించారు.
- చెన్నూర్ మండలంలో గంగారం గ్రామంలో పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యంగా సమాధానాలు ఇస్తున్నారంటూ గ్రామస్తులు మండిపడ్డారు. కాచన్‌పల్లిలో ఎంపీడీవో మోహన్ గంట ఆలస్యంగా రావడంతో సభ లేటుగా ప్రారంభమైంది. కొమ్మెర గ్రామంలో నిర్వహించిన గ్రామ సభను రద్దు చేయాలని కాంగ్రెస్ నాయకులు కుంట శంకర్ గౌడ్, మంత్రి రాజయ్య డిమాండ్ చేశారు. అధికారులు సర్వే సక్రమంగా చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అక్కడి నుంచి స్పెషల్ ఆఫీసర్ మల్లికార్జున్, వ్యవసాయ శాఖ ఏవో యామిని వెళ్లిపోయారు.
- రెబ్బెన మండలం లోని వంకులంలో తనకు భూమి లేదని ఆత్మీయ భరోసా పథకం జాబితాలో పేరు లేదని అధికారులను అమర్‌సింగ్ నిలదీశాడు. రోళ్లపహాడ్‌లో రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు రాని వారు ఆందోళన చేశారు.

# మర్లవడ్డ జనం

కోతలు.. కొర్రీలు..

- రెండో రోజూ ప్రజాపాలన గ్రామసభల్లో కొనసాగిన నిరసనలు, ఆందోళనలు
- పోలీసుల పహార మధ్య సభల నిర్వహణ
- తూతూ మంత్రంగా నిర్వహించడంపై జనం మండిపాటు
- నిర్మల్ జిల్లా అక్కాపూర్‌లో లబ్ధిదారుల జాబితా చించివేయాలని నిరసన



మంచిర్యాల ఏసీసీ : ఎన్టీఆర్‌నగర్‌లో అధికారులను నిలదీస్తున్న ప్రజలు

**లబ్ధిదారుల ఎంపికలో లోటు పాట్లు..** | **అర్హుల పేర్లు లేకపోవడంపై నిలదీత..**

ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక కోసం నిర్వహిస్తున్న గ్రామసభలు రెండో రోజైన బుధవారం యుద్ధ భూములను తలపించాయి. లబ్ధిదారుల ఎంపికలో లోటుపాట్లు ఉన్నాయంటూ.. అర్హుల పేర్లు జాబితాల్లో లేవంటూ జనం తిరగబడ్డారు. అర్హుల పేర్లు లేకుండా అధికార పార్టీ చెప్పినోళ్ల పేర్లతో జాబితాలు సిద్ధం చేశారా? అంటూ ప్రశ్నించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా పలు గ్రామ, వార్డు సభల్లో రెండో రోజైన బుధవారం నిరసనలు, నిలదీతలు, ఆందోళనలు కొనసాగాయి.

- మంచిర్యాల, జనవరి 22(నమస్తే తెలంగాణ ప్రతినిధి)



మందమర్రి రూరల్ : సారంగపల్లిలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు



కొమ్మెరలో అధికారులను నిలదీస్తున్న కాంగ్రెస్ నాయకుడు కుంట శంకర్ గౌడ్

### సర్వేలో అవతకవకలు జరిగాయి..



చెన్నూర్‌రూరల్ , జనవరి 22 : సంక్షేమ పథకాల కోసం కొమ్మెర గ్రామంలో అధికారులు చేసిన సర్వేతో పేదలకు అన్యాయం జరుగుతున్నది. అందుకే గ్రామసభను అడ్డుకున్నాం. సభను రద్దు చేయాలని డిమాండ్ చేశాం. ప్రతి సంక్షేమ పథకంపై ఎంపిక కోసం గ్రామంలో మళ్లీ సర్వే చేపట్టాలి. ఇంతకుముందు జరిగిన సర్వేలో చాలా అవకతవకలు జరిగాయి.

*-కుంట శంకర్‌గౌడ్, కాంగ్రెస్ నాయకుడు, కొమ్మెర, చెన్నూర్, మంచిర్యాల*

### నిజమైన అర్హులు కనిపించరా..?



వాంకిడి, జనవరి 22 : ఈ అధికారులకు నిజమైన అర్హులు కనిపించరా ?...దరఖాస్తులు. సర్వేల పేరుతో ఇప్పటికే రెండు సార్లు ఇంటికి వచ్చి వివరాలు సేకరించారు. కూలీ పని చేసి బతుకున్నాం.. ఉపాధిహామీ వంద రోజుల పనికి కూడా పోతున్న. గ్రామ సభలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం లిస్ట్‌లో నా పేరు రాలేదు. ఎందుకు రాలేదని అడిగితే అధికారులు సమాధానం చెబుతలేరు. ఈ పథకానికి నేను కచ్చితంగా అర్హుడినే.

*-బీ.పొచ్చు, కూలీ, అర్జుగూడ, వాంకిడి, కుమ్రం భీం ఆసిఫాబాద్*




జన్నారం: ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కామన్‌పెల్లి నాయికపుగూడ కాలనీ వాసులు

### ఇంటి ఫొటో తీసి..పేరు లేదంటున్నారు



కాసిపేట, జవనరి 22 : ప్రజా పాలన సభలో దరఖాస్తు చేసుకున్న కరెంట్ బిల్లు మాఫీ కాలేదు. ఇప్పటికీ బిల్లు కడుతున్న. అధికారులను అడిగితే ఆన్‌లైన్ ఓపెన్ కావడం లేదంటున్నారు. ఇప్పుడు కరెంట్ బిల్లు కోసం దరఖాస్తు పెడుదామని వస్తే అది ఇప్పుడు లేదని అధికారులు అంటున్నారు. ఇప్పుడు ఇంటి కోసం మొన్న ఫొటో తీశారు, ఇప్పుడు లిస్ట్‌లో పేరు లేదంటున్నారు.

*-గొడిశెల మల్లీశ్వరి, ముత్యంపల్లి, కాసిపేట, మంచిర్యాల*

### ఇండ్లు ఉన్నోళ్లకే వచ్చినయ్..



మంచిర్యాల అర్బన్, జనవరి 22: నేను సెంట్రింగ్ పని చేసుకుంటూ బతుకుతా. నా భార్య పేరు తారా లిస్టు లో మా పేరు రాలేదు. ఇప్పుడు వచ్చిన లిస్టులో 75 శాతం మంది పేర్లు ఇండ్లు ఉన్న వారివే వచ్చాయి. మళ్లీ నన్ను అప్లికేషన్ పెట్టుకోమంటున్నారు. నా దరఖాస్తును సర్వే చేసి నా పేరు మీదా ఇళ్లు ఇవ్వాలే. లేనోళ్లకు న్యాయం చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలే.

*- గొల్లపల్లి రాజు, రాజీవ్‌నగర్, మంచిర్యాల*

### ఇంటిపై తాడిపత్రి కప్పి ఉంటున్నం..



మంచిర్యాల అర్బన్, జనవరి 22: నేను ఇండ్లల్లో పాచిపని చేసుకుంటూ బతుకుతున్న. నేడు యాడికి పోవాలే. నడుమంత్రపు చిన్న చిన్న లీడర్లే మా అసోంటోళ్ల నోట్లే మట్టి కొడుతున్నారు. నా ఇంటికి వచ్చి సూడుండ్రి తాడిపత్రి( టార్పలిన్) వేసుకొని బతుకుతున్న. నా కష్టం చూసి గతంలోనే ప్రభుత్వం 75 గజాల జాగ ఇచ్చింది. ఈ ప్రభుత్వం ఇల్లు ఇస్తది అనుకున్న. మాలాంటి పేదలకు సాయం చేయాలి..

*-నడిమెల భాగ్య, రాజీవ్‌నగర్, మంచిర్యాల*



తాండూర్: అచ్చలాపూర్‌లో ఎమ్మెల్యే వైఖరిపై అసహనం వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకుడు కిష్టగౌడ్



చింతలమానేపల్లి : గంగాపూర్‌లో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

### పేదలకు న్యాయం చేయాలి



కాసిపేట, జనవరి 22 : మేము పేదోళ్లం, ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో కనీసం మా పేరు కూడా లిస్ట్‌లో లేదు. నాకైతే తప్పకుండా ఇళ్లు రావాలి. నేను పూర్తిగా అర్హురాలిని, కూలీ పని చేసుకుంటూ బతుకుతున్నాం. మళ్లీ దరఖాస్తు ఇవ్వాలని అధికారులు చెబితే మళ్లీ ఇచ్చిన. అర్హులైన పేదలకు న్యాయం చేయాలి.

*- పద్మ, ముత్యంపల్లి, కాసిపేట, మంచిర్యాల*



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, గ్రామస్తులు

## సమస్యలు చెప్పడానికి వస్తే అడ్డుకుంటారా?

- పోలీసులపై ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆగ్రహం
- కలెక్టరేట్ ఎదుట ధర్నా
- గ్రామాల సమస్యలను పరిష్కరించేదాకా పంచాయతీ ఎన్నికలను బహిష్కరిస్తాం

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఆసిఫాబాద్ టౌన్, జనవరి 22: 'కలెక్టరేట్ కార్యాలయం ప్రజల కోసమా లేదా పోలీసుల కోసమా ?' అని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలు కలెక్టర్‌ను కలిసి చెప్పడానికి వస్తె పోలీసులు అడ్డుకోవడం ఏమిటని ఎమ్మెల్యే కోవ లక్ష్మి పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్ మండలంలోని లొద్దిగూడ, కీమా నాయక్ తండా, చిన్న దాంపూర్ మూడు గ్రామ పంచాయతీలకు రోడ్డు సౌకర్యం, గ్రామాల్లోని రైతులకు ఉన్న రెవెన్యూ భూములను ధరణిలో నమోదు చేయడం కోసం ఆయా గ్రామాల ప్రజలతో కలిసి ఎమ్మెల్యే కోవ లక్ష్మి కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చేందుకు ఆసిఫాబాద్‌లోని కలెక్టరెట్‌కు వచ్చారు. ఆమెను గేటు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఆగ్రహించిన ఎమ్మెల్యే ప్రజలతో కలిసి అక్కడే ధర్నాకి దిగారు. ప్రజా సమస్యల పరిష్కారం, పరిపాలనా సౌలభ్యం కోసం బీఆర్ఎస్ సర్కార్ కలెక్టరేట్లను కట్టించిందని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అందులోకి ప్రజలను రానివ్వడం లేదని అలాంటప్పుడు కలెక్టరేట్ ఎందుకని, ప్రజాపాలన ప్రభుత్వమని ఎందుకు చెప్పుకుంటున్నారని ప్రశ్నించారు.ఎమ్మెల్యేనని చూడకుండా పోలీసులు అడ్డుకొని అగౌరవపరిచారని అసహనం వ్యక్తం చేశారు. అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర రావు అక్కడికి వచ్చి సముదాయించినా వినలేదు. కలెక్టర్ వచ్చి సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చే వరకూ కదిలేది లేదని భీష్మించుకూర్చున్నారు. దాదాపు రెండు గంటల నిరసన తర్వాత కలెక్టర్‌తో మాట్లాడానికి అనుమతి ఇవ్వ ఇచ్చారు. కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే గ్రామాల ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు లేక మూడు గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. గ్రామంలోని భూములకు గత బీఆర్ఎస్ సర్కార్ పట్టాలు ఇచ్చిందని అవి ధరణిలో నమోదు కావడం లేదని, విరాసత్ కావడం లేదని, రైతు బంధు రావడం లేదన్నారు. ఈ సమస్యలు పరిష్కరించేంత వరకూ గ్రామ పంచాయతీ ఎన్నికలను బహిష్కరిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో ఛైర్మన్ అలీ బిన్ అహ్మద్, బీఆర్ఎస్ నాయకులు, ఆయా గ్రామాల ప్రజలు ఉన్నారు.